



బుధవారం 5 ఆగస్టు 2026 | పేజీలు : 8

## ఎల్ నినో అంచనాలకు చెక్..!






నిండుకుండలా మారిన జలాశయం

అంబరాన్నంటిన ఆయకట్టు రైతుల ఆనందం..

పోచారం డ్యామ్‌పై నుంచి మత్తడి దుముకుతున్న నీరు

## పోచారం డ్యామ్‌కు
# భారీ వరద ప్రవాహం..

**మెదక్ (ప్రజా జ్యోతి)** తెలుగు రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలతో జలాశయాలు జలకళను సంతరించుకుంటున్నాయి. కామారెడ్డి – మెదక్ జిల్లాల సరిహద్దులోని ప్రసిద్ధ పోచారం డ్యామ్‌కు ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఈరోజు ఉదయం నుంచి డ్యామ్ పైనుంచి నీటి ప్రవాహం కొనసాగుతోంది. ఇటీవల కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాల కారణంగా పోచారం డ్యామ్‌కు జల ప్రవాహం గణనీయంగా పెరిగింది. ఎగువ ప్రాంతాల్లో పడుతున్న భారీ వర్షాలతో వరద నీరు ఉధృతంగా వస్తుండటంతో డ్యామ్ నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. జలాశయం నిండుకుండలా మారడంతో ఆయకట్టు రైతుల ముఖాల్లో ఆనందం వ్యక్తమవుతోంది. డ్యామ్‌లో నీటి నిల్వలు పెరగడం వల్ల ఈ ఏడాది సాగునీటి అవసరాలు సమృద్ధిగా తీరుతాయని, అలాగే పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలమట్టం కూడా బాగా మెరుగుపడుతుందని నీటిపారుదల శాఖ అధికారులు వెల్లడించారు. అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ తగిన చర్యలు తీసుకుంటున్నారు. మరొకవైపు, మత్తడి దుముకుతున్న పోచారం డ్యామ్ అందాలను తిలకించేందుకు పర్యాటకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు అప్రమత్తమయ్యారు. సందర్శకులు నీటి ప్రవాహ ప్రాంతాలకు దూరంగా ఉండాలని, ఎలాంటి ప్రమాదకరమైన సాహసాలకు పాల్పడవద్దని హెచ్చరించారు. పోచారం డ్యామ్ పూర్తిస్థాయిలో జలకళను సంతరించుకోవడంతో ఈసారి పంటలకు నీటి కొరత ఉండదని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# అక్రమాలకు ఓవైపు అధికారుల నోటీసులు...

మరోవైపు నిర్లక్ష్యంగా కొనసాగుతున్న వంతెన పనులు..

మన్నాన్పల్లి బంధం వాగు పై అధికారుల ఆదేశాలను బేఖాతరు చేసిన నిర్మాణదారులు...



# జాతీయ కిక్‌బాక్సింగ్‌లో మెదక్ క్రీడాకారిణి ప్రతిభ

క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని కలిసిన వర్షిత రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహం అందిస్తామని హామీ



**మెదక్ (ప్రజా జ్యోతి )ఆగస్టు 4:** మెదక్ పట్టణానికి చెందిన యువ క్రీడాకారిణి రెడ్డి మల్లి వర్షిత రెడ్డి జాతీయ స్థాయిలో మరోసారి తన ప్రతిభను చాటుకుంది. ఇటీవల నిర్వహించిన జాతీయ కిక్‌బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించి దేశవ్యాప్తంగా పోటీ పడిన ఆమె అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి 5వ స్థానం సాధించింది. ఈ విజయంతో మెదక్ జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్రానికి మంచి గుర్తింపు తీసుకువచ్చింది.వర్షిత రెడ్డి సాధించిన విజయాన్ని అభినందిస్తూ మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి శ్రీ వాకిటి శ్రీహరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మెదక్ పట్టణంలోని నవపేట వీధికి చెందిన మాజీ కౌన్సిలర్ రెడ్డి మల్లి సునీత అమృత రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ భేటీలో మంత్రి వర్షిత రెడ్డిని ప్రత్యేకంగా అభినందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రానికి పేరు తెచ్చే క్రీడాకారులను ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుందని తెలిపారు. వర్షిత రెడ్డి వంటి ప్రతిభావంతులైన క్రీడాకారిణులకు అవసరమైన శిక్షణ, పోటీలకు ఆర్థిక సహాయం, ఇతర ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలోనూ తెలంగాణకు పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.వర్షిత రెడ్డి మాట్లాడుతూ తన ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన మంత్రి వాకిటి శ్రీహరి, మాజీ కౌన్సిలర్ రెడ్డి మల్లి సునీత అమృత రెడ్డి, తన కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. మరింత కృషి చేసి జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు పతకాలు సాధించి రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వర్షిత రెడ్డి తండ్రి సాయి రెడ్డి, మరియు మెదక్ మున్సిపల్ కాంగ్రెస్ మాజీ కౌన్సిలర్ రెడ్డి మల్లి అమృత రెడ్డి తో మంత్రిని కలవడం జరిగింది.

# ఘనంగా బాల గ్రామసభ నిర్వహణ



**శివ్వంపేట ప్రజాజ్యోతి ఆగస్టు 04:** శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో మంగళవారం బాల గ్రామసభ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ బుర్ర మురళి గౌడ్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే గ్రామ పరిపాలన,పౌర హక్కులు,బాధ్యతలపై అవగాహన పెంపొందించుకోవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. పాఠశాలలో మౌలిక వసతుల అభివృద్ధి,విద్యార్థుల సమస్యల పరిష్కారానికి గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ సహకరిస్తుందని హామీ ఇచ్చారు. బాల గ్రామసభలో విద్యార్థులు పాఠశాలకు సంబంధించిన పలు సమస్యలను సర్పంచ్ దృష్టికి తీసుకురాగా,వాటిని త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయ బృందం,ఉప సర్పంచ్ స్వామి యాదవ్,పంచాయతీ కార్యదర్శి నాగేష్, గ్రామ పెద్దలు,విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థి దశలోనే గ్రామ సమస్యలపై అవగాహన కలిగి ఉండాలి,,,,

గ్రామాభివృద్ధిలో చిన్నారుల భాగస్వామ్యం కీలకం

--సర్పంచ్ రాజిపేట వెంకటేశ్వర్.



**శివ్వంపేట ప్రజాజ్యోతి ఆగస్టు 04:** శివ్వంపేట మండల కేంద్రంలో గ్రామాభివృద్ధి ప్రణాళిక లో భాగంగా మంగళవారం బాల గ్రామసభను ఘనంగా నిర్వహించారు.గ్రామ సర్పంచ్ రాజిపేట వెంకటేశ్వర్ అధ్యక్షతన,గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు,గ్రామ కార్యదర్శి రమాదేవి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ రాజిపేట వెంకటేశ్వర్ మాట్లాడుతూ, గ్రామాభివృద్ధి ప్రణాళిక రూపకల్పనలో చిన్నారుల అభిప్రాయాలకు ప్రాధాన్యత కల్పించేందుకు బాల గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిల్లల అవసరాలు,సమస్యలు తెలుసుకొని వాటికి అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడమే ఈ సభ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. బాల గ్రామసభలో విద్యకు సంబంధించిన పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు.ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు,పాఠశాల భవనాల నిర్వహణ,స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం, బాలురు--బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్లు, ఉపాధ్యాయుల సమయపాలన,విద్యా ప్రమాణాల మెరుగుదల వంటి అంశాలను విద్యార్థులు ప్రస్తావించారు. అదేవిధంగా చిన్నారుల ఆరోగ్యం,పోషకాహారం,అంగన్‌వాడీ సేవల మెరుగుదల,మధ్యాహ్న భోజన నాణ్యత,బాలల రక్షణ,బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన,బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పించారు. ఆట స్థలాల ఏర్పాటు,క్రీడా సామగ్రి అందుబాటు,గ్రంథాలయాల అభివృద్ధి, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాలపై కూడా చర్చించి పలు సూచనలు చేశారు. విద్యార్థులు సూచించిన సమస్యలను గ్రామపంచాయతీ పరిధిలో సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని సర్పంచ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజిపేట వెంకటేశ్వర్,గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు,గ్రామ కార్యదర్శి రమాదేవి,శివ్వంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది,విద్యార్థులు,గ్రామస్థులు పాల్గొన్నారు

## మెదక్ పట్టణంలో ఆషాడ ఆధ్యాత్మిక శోభ: వైభవంగా ముదిరాజ్ సోదరుల 'ఫలహారం బండి' ఊరేగింపు





**మెదక్(ప్రజా జ్యోతి)** మతసామరస్యానికి, భక్తిశ్రద్ధలకు నిలయమైన మెదక్ పట్టణంలో ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని ఆధ్యాత్మిక శోభ విరాజిల్లింది. మెదక్ పట్టణ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా ముదిరాజ్ సోదరుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా 'ఫలహారం బండి' ఊరేగింపు నిర్వహించారు. మెదక్ పట్టణంలోని ప్రముఖ బోరంచమ్మ ఆలయం నుండి ప్రారంభమైన ఈ శోభాయాత్ర... టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న నల్లపోచమ్మ గుడి వరకు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. ఫలహారం బండి ఊరేగింపుతో పాటు ముదిరాజ్ సంఘం మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. మొదటిసారిగా నిర్వహిస్తున్న ఈ వేడుకను పురస్కరించుకొని ముదిరాజ్ సంఘం యువతతో పాటు పట్టణ ప్రజలు, ఇతర హిందూ సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయవంతం చేశారు. వర్షం పడుతున్నప్పటికీ... వానను సైతం లెక్కచేయకుండా భక్తులు విపరీతమైన ఉత్సాహంతో, జై భవానీ నినాదాలు, పోతురాజుల విన్యాసాలు, డప్పు చప్పుళ్ల మధ్య ఈ ఊరేగింపులో పాల్గొన్నారు. మెదక్ పట్టణ వీధులన్నీ ఆధ్యాత్మిక సమరస్యంతో, పండుగ వాతావరణంతో పులకించిపోయాయి.

## దొంతి అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



**శివ్వంపేట ప్రజాజ్యోతి ఆగస్టు 04:** శివ్వంపేట మండలం దొంతి గ్రామంలోని అంగన్‌వాడీ--××కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యత,శిశువుల ఆరోగ్యానికి తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలపై తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ నీరుడి మౌనిక ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ,పుట్టిన శిశువుకు తల్లిపాలే సంపూర్ణ ఆహారమని,ప్రతి తల్లి తప్పనిసరిగా బిడ్డకు తల్లిపాలు అందించాలని సూచించారు. ఉప సర్పంచ్ భవనగారి శ్రీనివాస్ కూడా తల్లిపాల విశిష్టతను వివరించి,తల్లులు ఆరోగ్యకరమైన అలవాట్లు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త జ్యోతి,వార్డు సభ్యులు ఆనంద్,దయానంద్,నర్సింలు,గర్భిణులు,బాలింతలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఆగస్టు 10 జైల్ భరోను జయప్రదం చేయండి..

**కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా గ్రామాల్లో కరపత్రాల పంపిణీ..**



**కొండాపూర్ ప్రజా జ్యోతి** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 10న నిర్వహించే దేశవ్యాప్త "జైల్ భరో" కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం కొండాపూర్ మండలంలోని మాచేపల్లి, శివన్నగూడెం, మారేపల్లి గ్రామాల్లో ఆగస్టు 10న కొండాపూర్ మండల కేంద్రంలో జరిగే జైల్ భరో కార్యక్రమానికి ప్రజలను ఆహ్వానిస్తూ విస్తృతంగా కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య, మండల నాయకుడు బాబురావు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లు కార్మికుల హక్కులను కాలరాసే విధంగా ఉన్నాయని విమర్శించారు. యూనియన్లు ఏర్పాటు చేసుకునే హక్కు, సమ్మె చేసే హక్కు, ఎనిమిది గంటల పనిదినం వంటి కార్మిక హక్కులు ప్రమాదంలో పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, గ్రామపంచాయతీ వీఓఏలతో అధిక పని చేయించుకుంటున్నప్పటికీ వారికి తగిన వేతనాలు, సౌకర్యాలు, భద్రత కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రైతులకు అనుకూలంగా పనిచేస్తామని చెప్పే ప్రభుత్వం వాస్తవానికి విద్యుత్ సవరణ బిల్లు, విత్తన సవరణ బిల్లు వంటి చర్యలతో వ్యవసాయ రంగానికి నష్టం కలిగిస్తోందని పేర్కొన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని, గత 12 ఏళ్లలో రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు, యువత, మహిళలు, విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఒరిగించింది ఏమీ లేదని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలను ఐక్యంగా తిప్పికొట్టాలని, ఆగస్టు 10న జరిగే దేశవ్యాప్త జైల్ భరో కార్యక్రమంలో రైతులు, కార్మికులు, కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సురేష్, సోమల చందర్, కిషన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

**జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య పిలుపు**
**డాక్టర్ పి సంజీవరెడ్డి శాసనసభ్యులు నారాయణఖేడ్**
**జ్ఞాన సంపదకు నిలువు అద్దాలు గ్రంథాలయాలు**





**కల్హేర్, ఆగస్టు 4 (ప్రజా జ్యోతి ప్రతినిధి):** విద్యార్థులు, యువత, నిరుద్యోగులు గ్రామ స్థాయి వరకు అందుబాటులో ఉన్న గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య పిలుపునిచ్చారు. మంగళవారం కల్హేర్ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పి. సంజీవరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, ఆరోగ్య రంగాలకు ప్రాధాన్యం ఇస్తూ పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ముఖ్యంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు, యువతకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను వినియోగించుకుని విద్యాభివృద్ధితో పాటు పోటీ పరీక్షల్లో విజయాలు సాధించాలని సూచించారు. ఎమ్మెల్యే డాక్టర్ పి. సంజీవరెడ్డి మాట్లాడుతూ , పుస్తకాల పఠనమే వ్యక్తిని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తుందన్నారు. డిజిటల్ యుగంలోనూ గ్రంథాలయాల్లోని పుస్తకాలు, పత్రికలు, అధ్యయన సామగ్రి విద్యార్థులకు ఉత్తమ మార్గదర్శకాలని పేర్కొన్నారు. నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన అనేక మంది యువత ఐఏఎస్, ఐపీఎస్, వైద్య, గ్రూప్-1 వంటి ఉన్నత ఉద్యోగాలు సాధించడంలో గ్రంథాలయాల పాత్ర కీలకమని గుర్తుచేశారు. జిల్లా గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని అంజయ్య తెలిపారు. నారాయణఖేడ్ గ్రంథాలయానికి రూ.50 లక్షలు, గ్రామీణ గ్రంథాలయాల అభివృద్ధికి రూ.60 లక్షల గ్రాంట్లు మంజూరు చేయించినట్లు వెల్లడించారు. ఆధునిక అవసరాలకు అనుగుణంగా తాజా ఎడిషన్ల పుస్తకాలు, పోటీ పరీక్షల అధ్యయన సామగ్రిని అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

గ్రంథాలయానికి అవసరమైన సదుపాయాల కల్పనకు తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే డాక్టర్ పి. సంజీవరెడ్డి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ కె. శివ శ్రీనివాస్ తన కుమార్తె తరపున రూ.10 వేల విరాళాన్ని అందజేయగా, బీబీపేట గ్రామానికి చెందిన మహిపాల్ రెడ్డి గ్రంథాలయానికి 25 కుర్చీలను విరాళంగా అందించారు.

కార్యక్రమంలో కల్హేర్ సర్పంచ్ కోడి గంగారాం, ఉపసర్పంచ్ పి. మహేష్, సీడీసీ మాజీ చైర్మన్ నరసింహారెడ్డి, తహసీల్దార్ కె. శివ శ్రీనివాస్, ఎంపీడీవో హరి నందన్ రావు, ఏడీపీ నూతన కుమార్, ఎస్ఐ ఏ. రవి గౌడ్, గ్రంథాలయ అధికారి లలితాబాయి, ఎం. తుకారం, ఎం. వీర్ శెట్టి, గైని దేవదాస్, గ్రంథాలయ సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసి, గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన అధ్యయన వాతావరణం కల్పించడంలో ఈ కార్యక్రమం కీలకంగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు.

## అక్రమాలకు ఓవైపు అధికారుల నోటీసులు...

**కొండాపూర్ ప్రజా జ్యోతి** మండలం మన్నాన్పల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్-114 బంధం వాగు పై ఇరిగేషన్, రెవెన్యూ, గ్రామపంచాయతీ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే చేపట్టిన వంతెన నిర్మాణ పనులు వివాదాస్పదంగా మారాయి. అక్రమంగా జరుగుతున్న ఈ నిర్మాణంపై స్పందించిన ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సోమవారం సంబంధిత యజమానికి పనులను వెంటనే నిలిపివేయాలని నోటీసులు జారీ చేశారు. అనుమతులు లేకుండా ప్రభుత్వ బంధంపై నిర్మాణాలు చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని నోటీసులో స్పష్టం చేసినట్లు సమాచారం. అయితే అధికారుల హెచ్చరికలను, నోటీసులను సైతం పట్టించుకోకుండా వంతెన నిర్మాణ పనులు యథావిధిగా కొనసాగుతుండడం అధికార యంత్రాంగం పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. నోటీసులు జారీ చేసిన తర్వాత కూడా పనులు ఆగకపోవడంతో, అధికారులు కేవలం నోటీసులకే పరిమితమయ్యారా? లేక అక్రమ నిర్మాణదారులపై చర్యలు తీసుకునే ధైర్యం లేదా? అనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామస్తులు మాట్లాడుతూ, ప్రభుత్వ భూములు, చెరువు బంధాలపై అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటే అక్రమాలకు అడ్డుకట్ట ఎలా పడుతుందని ప్రశ్నిస్తున్నారు. వెంటనే నిర్మాణ పనులను నిలిపివేసి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**రైతుల ప్రశ్నలు**

నోటీసులు ఇచ్చినా పనులు ఎందుకు ఆగలేదు?

అధికారుల ఆదేశాలను ధిక్కరించే ధైర్యం అక్రమ నిర్మాణదారులకు ఎక్కడి నుంచి వచ్చింది?

అధికారులు తదుపరి చర్యలు తీసుకుంటారా? లేక నోటీసులతోనే సరిపెడతారా?

ఈ ఘటనపై సంబంధిత శాఖలు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నోటీసులు ఇచ్చిన పనులు ఎందుకు ఆగడం లేదు?

## కల్హేర్‌లో రేషన్ బియ్యం అక్రమ రవాణా పట్టివేత

**ఎస్.ఐ. ఏ. రవిగౌడ్**



**కల్హేర్, ఆగస్టు 4 (ప్రజా జ్యోతి):** మహారాష్ట్రలోని కల్హేర్ మండల పరిధిలో జాతీయ రహదారి--161పై రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న లారీని అధికారులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు నిర్వహించిన తనిఖీల్లో, ఓ ధాబా సమీపంలో నిలిపి ఉంచిన లారీలో భారీ మొత్తంలో రేషన్ బియ్యం సంచులు ఉన్నట్లు గుర్తించారు. వెంటనే అధికారులు లారీని స్వాధీనం చేసుకుని, బియ్యం మూలం, గమ్యస్థానం, అక్రమ రవాణా వెనుక ఉన్న వ్యక్తుల పాత్రపై దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనతో కల్హేర్ ప్రాంతంలో రేషన్ బియ్యం అక్రమ రవాణాపై అధికారుల నిఘా మరింత కట్టుదిట్టమైంది. విచారణ పూర్తయిన అనంతరం కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడిస్తామని అధికారులు తెలిపారు. ప్రస్తుతం లారీతో పాటు బియ్యం సంచులను స్వాధీనం చేసుకుని తదుపరి చర్యలు కొనసాగిస్తున్నట్లు సమాచారం.

# ఎల్ నినో అంచనాలకు చెక్..!


## మూడు వారాల పాటు వర్షాల జోరు పెరిగే సూచనలు

**కల్వ్హ ర్ , ఆగస్టు 4:. ప్రజా జ్యోతి** ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు బలహీనపడతాయన్న అంచనాల మధ్య రైతులకు ఊరటనిచ్చే సంకేతాలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయ వాతావరణ నిపుణుల తాజా విశ్లేషణ ప్రకారం, రాబోయే రెండు నుంచి మూడు వారాల పాటు దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు చురుగ్గా కొనసాగనున్నాయి. హిందూ మహాసముద్రం, బంగాళాఖాతంలో ఏర్పడుతున్న అనుకూల వాతావరణ పరిస్థితులు విస్తృత వర్షాలకు దోహదపడే అవకాశముందని పేర్కొన్నారు.

దేశంలోని ఉత్తర, తూర్పు, మధ్య భారత ప్రాంతాల్లో ప్రస్తుతం అల్పపీడన వ్యవస్థలు చురుగ్గా కొనసాగుతున్నాయి. వీటికి తోడు మ్యాడెన్--జూలియన్ ఆసిలేషన్ (మజో ) ప్రభావంతో బంగాళాఖాతం దక్షిణ ప్రాంతంలో తేమ, మేఘాల ఏర్పాటుకు అనుకూల పరిస్థితులు నెలకొన్నాయి. ఈ రెండు వ్యవస్థల ప్రభావంతో రానున్న 15 రోజుల్లో అనేక రాష్ట్రాల్లో సాధారణం నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు.

ఎల్ నినో ప్రభావం కొనసాగుతున్నప్పటికీ, హిందూ మహాసముద్రంలోని వాతావరణ మార్పులు కొంత మేర ప్రతికూల ప్రభావాన్ని తగ్గించే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఇండియన్ ఓషన్ డైపోల్ (ఐడ్ ) తటస్థ స్థితిలో కొనసాగుతున్నప్పటికీ, రానున్న రోజుల్లో పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకుంటే భారత ఉపఖండంలో వర్షాలకు మరింత అనుకూల వాతావరణం ఏర్పడే అవకాశముందని తెలిపారు.

వాతావరణ నిపుణుల అభిప్రాయం ప్రకారం, రాబోయే పదిహేను రోజులు ఈ ఏడాది వర్షాకాలం తీరు ఎలా ఉండబోతుందో నిర్ణయించే కీలక దశగా మారనున్నాయి. ఈ కాలంలో ఆశించిన




స్థాయిలో వర్షాలు కురిస్తే ఖరీఫ్ పంటలకు అవసరమైన తేమ లభించడంతో పాటు సాగు పనులు వేగవంతమయ్యే అవకాశం ఉంది. వర్షాల పెరుగుదలతో జలాశయాల్లో నీటి నిల్వలు కూడా మెరుగుపడే అవకాశముందని భావిస్తున్నారు.

ముఖ్యాంశాలు

ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ వర్షాలకు అనుకూల సంకేతాలు.

రాబోయే రెండు నుంచి మూడు వారాల పాటు నైరుతి రుతుపవనాలు చురుకుగా కొనసాగే అవకాశం.

అల్పపీడనాలు, (మజో ) ప్రభావంతో పలు రాష్ట్రాల్లో విస్తృత వర్షాలు కురిసే సూచనలు.

ఖరీఫ్ సాగుకు, జలాశయాల్లో నీటి నిల్వలకు ఊరటనిచ్చే పరిస్థితులు.

రానున్న 15 రోజులు ఈ ఏడాది వర్షాకాలానికి కీలకంగా మారనున్నాయి.

### వార్డు నెంబర్ 22లో మురికి కాలువ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టిన

# మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్

**జహీరాబాద్, ఆగస్టు 04(ప్రజా జ్యోతి న్యూస్)** జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని 22వ వార్డులో ప్రజలు ఎన్నో రోజులుగా ఎదుర్కొంటున్న మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా మురికి కాలువ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ ఈరోజు ఘనంగా ప్రారంభించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, నాయకులు, కాలనీవాసుల సమక్షంలో సిమెంట్ కాంక్రీట్ పోసి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ మాట్లాడుతూ, వర్షకాలంలో మురుగు నీరు నిల్వ ఉండడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పారిశుద్ధ్య సమస్యలతో పాటు దోమల వ్యాప్తి, అంటువ్యాధులు వచ్చే ప్రమాదం కూడా పెరుగుతుందని తెలిపారు. ఈ సమస్యలను పూర్తిగా నివారించేందుకు నాణ్యమైన మురికి కాలువ నిర్మాణాన్ని చేపట్టామని చెప్పారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే మున్సిపల్ పాలకవర్గం ప్రధాన లక్ష్యం అని పేర్కొన్న ఆయన, ప్రతి వార్డులో ప్రజల అవసరాలకు అనుగుణంగా రోడ్లు, మురికి కాలువలు, తాగునీటి సౌకర్యాలు, వీధి దీపాలు వంటి అభివృద్ధి పనులు కొనసాగు తున్నాయని తెలిపారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, నిర్ణీత గడువులో పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. అలాగే స్థానిక ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను తడి చెత్త, పొడిచెత్తను వేర్వేరుగా చేసి మున్సిపల్ నుండి వచ్చే చెత్త బండి వావనంలోనే వెయ్యాలని కోరారు.



స్థానిక ప్రజలు కూడా ఈ అభివృద్ధి పనులను హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతించారు. ఎన్నో సంవత్సరాలుగా నెలకొన్న సమస్యకు పరిష్కారం లభిస్తుందని, ప్రజల సమస్యలను గుర్తించి వెంటనే స్పందించిన మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్, ఏఈ ఖాజా, వార్డు కౌన్సిలర్ జమీలుద్దీన్, కౌన్సిలర్లు జహంగీర్, అక్రమ్, నాయకులు బర్కత్, ముఖీమ్ మున్సిపల్ అధికారులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఖంజమల్పూర్‌లో సహజ వ్యవసాయంపై క్షేత్ర ప్రదర్శన

**గోకృపామృతం తయారీ,పాలేకర్ 5 అంచెల సాగు విధానంపై రైతులకు అవగాహన**

**రాయికోడ్ ఆగస్టు 4 (ప్రజా జ్యోతి):** మండలంలోని ఖంజమల్పూర్ గ్రామానికి చెందిన రైతు శ్రీ విఠల్ రెడ్డి పొలంలో ఆత్మ ఆధ్వర్యంలో సహజ వ్యవసాయ విధానంపై క్షేత్ర ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు గోకృపామృతం తయారీ విధానాన్ని క్షేత్రస్థాయిలో ప్రయోగాత్మకంగా చూపించి,దాని ఉపయోగాలు మరియు ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ.. గోకృపామృతం దేశీయ ఆవు ఆధారంగా తయారయ్యే సహజ జీవామృత ద్రావణమని తెలిపారు. ఇది నేలలో ఉపయోగకరమైన సూక్ష్మజీవుల సంఖ్యను పెంచి,మొక్కల వేర్ల అభివృద్ధికి తోడ్పడటంతో పాటు పోషకాల లభ్యతను మెరుగుపరచి పంట ఆరోగ్యవంతంగా ఎదగడానికి దోహదపడుతుందని వివరించారు. అలాగే రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి,నేల సారాన్ని కాపాడడంలో గోకృపామృతం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా సహజ వ్యవసాయ పితామహుడు సుభాష్ పాలేకర్ ప్రతిపాదించిన 5 అంచెల సాగు విధానాన్ని రైతు విఠల్ రెడ్డి తన పొలంలో అమలు చేస్తున్న విధానాన్ని రైతులకు వివరించారు. బీజామృతంజీవామృతం/గోకృపామృతం,ఆచ్ఛాదన,వాపాసా,సహజ కీటక నివారణ వంటి పద్ధతులను అనుసరించడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక నాణ్యత గల దిగుబడులు సాధించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీమతి సారిక,వ్యవసాయ విస్తరణ అధికారులు శివకుమార్,నిఖిలేష్,ఏటీఎం రమేష్,గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.




## గ్రంథాలయ అభివృద్ధికి రూ.10,000 విరాళం..

**కల్వ్హ ర్., ఆగస్టు 4:ప్రజా జ్యోతి** కల్వ్హ ర్ తహసీల్దార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక గ్రంథాలయ అభివృద్ధి కోసం రూ.10,000 విలువైన చెక్కును విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని ఒక దాత కల్వ్హ ర్ తహసీల్దార్ కే. శివ శ్రీనివాస్ తన కుమార్తె ద్వారా అందించడం విశేషం. ఈ చెక్కును శాసనసభ్యులు డాక్టర్ పి. సంజీవరెడ్డి మరియు గ్రంథాలయ చైర్మన్ అంజయ్య సమక్షంలో అందజేశారు. గ్రంథాలయ అభివృద్ధికి అందిన ఈ విరాళాన్ని వారు స్వీకరించి, దాత కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు.



ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పి. సంజీవరెడ్డి మాట్లాడుతూ, సమాజ అభివృద్ధికి గ్రంథాలయాలు కీలకమని, వాటి అభివృద్ధికి ప్రజలు ముందుకు వచ్చి సహకరించడం అభినందనీయమన్నారు. గ్రంథాలయ చైర్మన్ అంజయ్య మాట్లాడుతూ, అందిన విరాళాన్ని గ్రంథాలయంలో అవసరమైన సౌకర్యాల కల్పనకు వినియోగిస్తామని తెలిపారు.

కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రంథాలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. దాత కుటుంబం చేసిన ఈ సేవను పలువురు అభినందించారు